బ్రిజ్ భూషణ్ వేధింపులకు మరోసాక్షి

- తప్పు జరగడం నేను చూశా
- అంతర్జాతీయ రిఫరీ జగ్బీర్ సింగ్
- బ్రిజ్ భూషణ్ ఇంటికి రెజ్లర్
- సంగీతా ఫోగట్‌ను తీసికెళ్లినఢిల్లీ పోలీసులు
- రాజీకి రెజ్లర్లంటూ మీడియా కథనాలను ఖండించిన రెజ్లర్లు
- రెజ్లర్లు విద్వేష ప్రసంగాలు చేయలేదు : ఢిల్లీ పోలీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ ఆగడాలను ఒక్కొక్కరు బయట పెడుతున్నారు. మొన్న కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతాకం సాధించిన రెజ్లర్ అనిత కొన్ని సాక్ష్యాలను బయటపెట్టారు. తాజాగా అంతర్జాతీయ రిఫరీ జగ్బీర్ సింగ్ మరికొన్ని అంశాలను బయటపెట్టారు. అంతర్జాతీయ రిఫరీ జగ్బీర్ సింగ్ మాట్లాడుతూ 'బ్రిజ్ భూషణ్ ఆమె పక్కన నిలబడి ఉండటం చూశాను. ఆమె తనను తాను విడిపించుకుందని, ఆమెకు ఏదో తప్పు జరిగిందని తాను అనుకున్నానన్నారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ రెజ్లర్ పిరుదులను తాకిన సంఘటనపై ఎఫ్ఐఆర్‌లో జగ్బీర్ సింగ్ పేర్కొన్నారు. 2007 నుండి అంతర్జాతీయ రెజ్లింగ్ రిఫరీ ఉన్న జగ్బీర్ సింగ్ ఢిల్లీ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో రెజ్లర్ ఆరోపణలను ధృవీకరించారు. జగ్బీర్ సింగ్ ఫోటోను ప్రస్తావించారు. దాని గురించి ఢిల్లీ పోలీసులు తనను అడిగారని చెప్పారు. లక్నోలో గెలిచిన తరువాత ఫోటో తీసుకున్నప్పుడు పిరుదలపై చేయ వేసినట్లు తాను చూశానని అన్నారు. "నేను ఆయనను (బ్రిజ్ భూషణ్) ఆమె పక్కన నిలబడి ఉండటం చూశాను. ఆమె తనను తాను విడిపించుకుని, దూరంగా నెట్టివేసి, గొణుగుతూ దూరంగా కదిలింది. ఆమె ప్రెసిడెంట్ పక్కన నిలబడి ఉంది. కానీ తర్వాత ముందుకు వచ్చింది. ఈ మహిళా రెజ్లర్ ఎలా స్పందిస్తుందో నేను చూశాను. ఆమె అసౌకర్యంగా ఉంది. ఉస్కే సాథ్ కుచ్ గలాత్ హువా (ఆమెకు ఏదో తప్పు జరిగింది). ఆయన ఆ పని చేయడం నేను చూడలేదు. కానీ ఉస్కే హాత్ పెయిర్ ఖూబ్ చల్తే ది, ఇదార్ ఆ జా. ఇధర్ ఖాదీ హెూ జా (ఇక్కడకు రండి, వచ్చి ఇక్కడ నిలబడండి అంటూ మల్లయోధులను తాకుతూ ఉండేవాడు). ఆమె (ఫిర్యాదుదారు) ప్రవర్తనను బట్టి, ఆ రోజు (ఫోటో సెషన్ సమయంలో) ఏదో తప్పు జరిగిందని స్పష్టమైంది" అని జగ్బీర్ అన్నారు.ఫోటో కోసం ముందు వరుసలోకి వెళ్లడానికి ముందు సింగ్ ఆమెను బలవంతంగా భుజం పట్టుకున్నాడు. "నేను ఎత్తైన రెజ్లర్లలో ఒకరిని కాబట్టి, నేను చివరి వరుసలో నిలబడవలసి ఉంది. నేను చివరి వరుసలో నిలబడి ఇతర మల్లయోధులు తమ స్థానాలను తీసుకుంటారని ఎదురు చూస్తుండగా, నిందితులు వచ్చి నా పక్కన నిలబడ్డారు. నాకు షాక్. ఆశ్చర్యానికి గురయ్యాను. నేను అకస్మాత్తుగా నా పిరుదులపై చేయి వేశారు. నేను వెంటనే వెనక్కి తిరిగి చూసాను. భయానక స్థితికి లోనైయ్యాను. నిందితుడు నా పిరుదులపై తన చేతులు ఉంచాడు. నిందితుడు మరింత అనుచితంగా తాకకుండా నన్ను రక్షించుకోవడానికి నేను వెంటనే ఆ ప్రదేశం నుండి దూరంగా వెళ్లడానికి ప్రయత్నించాను. అయితే, నేను దూరంగా వెళ్లడానికి ప్రయత్నించినప్పుడు, నిందితులు నన్ను బలవంతంగా నా భుజం పట్టుకున్నారు. ఎలాగోలా నిందితుల బారి నుంచి బయటపడ్డాను. టీమ్ ఫోటోను క్లిక్ చేయడాన్ని నేను తప్పించుకోలేను కాబట్టి, నేను వెళ్లి నిందితులకు దూరంగా మొదటి వరుసలో కూర్చోవాలని నిర్ణయించుకున్నాను" అని ఎఫ్ఐఆర్ పేర్కొంది.ఒక ఒలింపియన్, కామన్వెల్త్ గేమ్స్ బంగారు పతక విజేత, అంతర్జాతీయ రిఫరీ, రాష్ట్ర స్థాయి కోచ్ ముగ్గురు మహిళా రెజ్లర్ల ఆరోపణలను ధృవీకరించారు. నాలుగు రాష్ట్రాల్లోని 125 మంది సాక్షులలో జగ్బీర్ సింగ్ కూడా ఉన్నారు. కామన్వెల్త్ క్రీడల బంగారు పతక విజేత అనిత, బయటకొచ్చి ఆధారాలను వెల్లడించిన రెండో సాక్షి జగ్బీర్. ఇద్దరు రెజ్లర్లు చేసిన వాదనలను ఈ ఇద్దరూ ధృవీకరించారు.

బ్రిజ్ భూషణ్ ఇంటికి రెజ్లర్ సంగీతా ఫోగట్‌ను తీసికెళ్లిన ఢిల్లీ పోలీసులు

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అధికారిక నివాసానికి ఢిల్లీ పోలీసులు రెజ్లర్ సంగీతా ఫోగట్‌ను శుక్రవారం ఢిల్లీ పోలీసులు తీసుకెళ్లారు. సంగీతా ఫోగట్‌తో పాటు మహిళా కానిస్టేబుళ్లు కూడా ఉన్నారని సమాచారం. అక్కడ లైంగిక వేధింపులకు దారితీసిన సీన్ రీక్రియేట్ చేసినట్లు తెలుస్తోంది. "శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఢిల్లీలోని బ్రిజ్ భూషణ్ అధికారిక నివాసానికి పోలీసులు మహిళా రెజ్లర్ సంగీతా ఫోగట్‌ను తీసుకెళ్లారు. ఆమె వెంట మహిళా కానిస్టేబుల్స్ కూడా ఉన్నారు. వారు అరగంట పాటు అక్కడే ఉన్నారు. ఆ దృశ్యాన్ని మళ్లీ రూపొందించాలని, ఆమె వేధింపులను ఎదుర్కొన్న ప్రదేశాలను గుర్తుకు తెచ్చుకోవాలని ఆమెను అడిగారు" అని విశ్వసనీయ వ్యక్తుల ద్వారా తెలిసింది. మహిళా రెజ్లర్ బ్రిజ్ భూషణ్ ఇంటికి వెళ్లలేదని, విచారణ కోసం పోలీసులు తీసుకెళ్లారని రెజ్లర్లు, ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. దర్యాప్తులో భాగంగా సిట్ 180 మందికి పైగా ప్రశ్నించినట్లు ఢిల్లీ పోలీసు అధికారులు తెలిపారు.

కాగా, సంగీతా ఫోగట్ కనిపించిన తరువాత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌తో లైంగిక వేధింపుల సమస్యను రెజ్లర్లు పరిష్కరించుకుంటున్నారంటూ వస్తున వార్తలను రెజ్లర్లు వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా ఖండించారు. బ్రిజ్ భూషణ్ తన అధికారాన్ని ఉపయోగించి కథనాన్ని మార్చేస్తున్నాడని పేర్కొన్నారు. "ఇది బ్రిజ్ భూషణ్ శక్తి. ఆయన తన కండబలం, రాజకీయ శక్తి, తప్పుడు కథనాలను ఉపయోగించి మహిళా రెజ్లర్లను వేధించడంలో బిజీగా ఉన్నాడు" అని వినేష్ ఫోగట్ పేర్కొన్నారు. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. "పోలీసులు మమ్మల్ని విడదీయడానికి బదులు ఆయనను అరెస్టు చేస్తే, న్యాయం జరుగుతుందనే ఆశ ఉంది. లేకపోతే లేదు" అని వినేష్ పేర్కొన్నారు. "మహిళా రెజ్లర్లు పోలీసు విచారణ కోసం క్రైమ్ సైట్‌కు వెళ్లారని, అయితే వారు రాజీకి వెళ్లారని మీడియాలో ప్రచారం జరిగింది" అని వినేష్ విమర్శించారు. "తప్పుడు కథనాలను నడుపుతూ మహిళా రెజ్లర్లను బ్రిజ్ భూషణ్ ఇబ్బంది పెడుతున్నాడు. ఆయనను అరెస్టు చేయకుండా పోలీసులు మమ్మల్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తు న్నారు" అని బజరంగ్ పునియా అన్నారు.అలాగే, బ్రిజ్ భూషణ్ ఇంటికి మహిళా రెజ్లర్లు వెళ్లడంపై తప్పుడు వార్తలు వస్తున్నాయని ఢిల్లీ పోలీసులు కూడా స్పష్టం చేశారు. "దయచేసి పుకార్లను పట్టించుకోవద్దు. ఢిల్లీ పోలీసులు ఒక మహిళా రెజ్లర్‌ను విచారణ కోసం రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి తీసుకెళ్లారు" అని డిసిపి న్యూఢిల్లీ అధికారిక హ్యాండిల్ ట్వీట్ చేసింది. అదే సమయంలో తన నివాసానికి ఎవరూ రాలేదని బ్రిజ్ భూషణ్ పేర్కొన్నారు. రెజ్లర్ల ఆందోళన తప్పుడు సమాచారానికి గురి కావడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల, రెజ్లర్లు తమ రైల్వే విధులను తిరిగి ప్రారంభించిన తరువాత తమ నిరసనను ముగించినట్లు తప్పుడు ప్రచారం జరిగింది.

రెజ్లర్లు విద్వేష ప్రసంగాలు చేయలేదు : ఢిల్లీ పోలీసులు

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఆరోపణలు చేస్తున్న రెజ్లర్లు విద్వేష ప్రసంగాలు చేయలేదని, విచారించదగిన నేరానికి పాల్పడలేదని ఢిల్లీ పోలీసులు శుక్రవారం కోర్టుకు తెలిపారు. బ్రిజ్ భూషణ్‌పై రెజ్లర్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, విద్వేషపూరితంగా మాట్లాడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బమ్ బమ్ మహరాజ్ నౌహాటియా స్థానిక కోర్టులో ఫిర్యాదు చేశారు. రెజ్లర్లు వినేష్ ఫోగట్, బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్‌లపై కేసు నమోదు చేయాలని కోరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా వీరు నినాదాలు చేశారని, విద్వేషపూరితంగా మాట్లాడారని ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై నివేదికను సమర్పించాలని మే 25న స్థానిక కోర్టు ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అందుకు అనుగుణం గానే ఈ నివేదికను పోలీసులు కోర్టుకు సమర్పించారు. ఫిర్యాదుదారు సమర్పించిన వీడియోను ఢిల్లీ పోలీసులు ప్రస్తావిస్తూ, రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్వేషపూరితంగా మాట్లాడలేదని, నినాదాలు చేయలేదని చెప్పారు. ఈ ఫిర్యాదును తోసిపుచ్చాలని కోర్టును కోరారు. ఈ కేసులో తదుపరి విచారణ జూలై 7న జరుగుతుంది.

'పీపుల్ ఫార్మసీ' పథకాన్ని పునరుద్ధరించిన లూలా



బ్రసీలియా : బ్రెజిల్ అధ్యక్షుడు లూలా 'పీపుల్ ఫార్మసీ' ప్రభుత్వ పథకం కొత్త వెర్షన్‌ను బుధవారం ప్రవేశపెట్టారు. ప్రజలకు మందులను ఉచితంగా, తక్కువ ధరకు అందించనున్నట్టు ప్రకటించారు. చాలామంది బ్రెజీలియన్లు ప్రిస్క్రిప్షన్ ఉన్నా మందులు కొనేందుకు డబ్బులేక చనిపోతున్నారని, ఇకపై తమ దేశంలో ఇలా జరగదని స్పష్టం చేశారు. పీపుల్స్ ఫార్మసీ ప్రజలందరి కోసం మరిన్ని మందులతో, ఎక్కువ మంది వైద్యులతో, ఫ్యామిలీ బ్యాగ్ ప్రోగ్రామ్‌తో తిరిగి వస్తోందని అన్నారు. ఈ పథకంతో 40 మందులను ఉచితంగా పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఉచిత కేటగిరీతో పాటు ఇతర ఫార్మసీల్లోని ధరలతో పోలిస్తే 90శాతం వరకు తగ్గింపుతో మందులను అందించనున్నట్టు తెలిపారు. 2004లో లూలా మొదటిసారి బ్రెజిల్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. డయాబెటిస్, ఆస్థమా, హైపర్ టెన్షన్ సహా 13 రకాల మందులను ప్రజలు ఉచితంగా పొందే అవకాశం కలిగించారు. అనంతరం బోల్సెనారో ప్రభుత్వం ఈ పథకం పరిధిని తగ్గించింది.

చైనాతో సైనిక సంబంధాల వల్ల అంతర్జాతీయ సుస్థిరత

- రష్యా కమాండర్ వ్యాఖ్యలు

మాస్కో : చైనాతో తమ బలమైన సైనిక భాగస్వామ్యం ప్రపంచవ్యాప్తంగా సుస్థిరతను అందచేస్తుందని రష్యా సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ వాలెరి గెరాసిమొవ్ శుక్రవారం పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో రష్యా సైనిక చర్యలకు కమాండర్‌గా వ్యవహరిస్తున్న గెరాసిమొవ్ చైనా సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ లియూ ఝెన్‌లీతో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ వేదికపై రష్యా, చైనా ప్రయత్నాల సమన్వయం మొత్తంగా అంతర్జాతీయ స్థితిగతులపై సుస్థిర ప్రభావాన్ని కనబరుస్తుందని గెరాసిమొవ్ చెప్పారు. ఈ మేరకు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక వీడియోను విడుదల చేసింది. వ్యూహాత్మకమైన రష్యా-చైనా రక్షణ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడాన్ని కొనసాగించడానికి ఈనాటి సమావేశాలు దోహదపడతాయని అన్నారు. ఈ భాగస్వామ్యానికి రష్యా, చైనా సంయుక్త మిలటరీ విన్యాసాలు ప్రధాన వేదికగా వుండాలన్నారు. లియూను మాస్కోలో పర్యటించాల్సిందిగా ఆహ్వానించారు. ఆర్థిక, మిలటరీ రంగాల్లో తమ భాగస్వామ్యానికి, సహకారానికి పరిమితులు లేవని ఇరు పక్షాలు పదే పదే చెబుతూ వస్తున్నాయి. ఉక్రెయిన్‌లో రష్యా సైనికచర్య, ఫలితంగా పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో ఈ రెండు దేశాలు మరింత సన్నిహితమయ్యాయి.

అక్రమ బొగ్గు గనిలో ప్రమాదం : ముగ్గురి మృతి

రాంచీ: జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో అక్రమ బొగ్గు గని కుప్పకూలి ముగ్గురు మృతిచెందారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నారు. బీసీసీఎల్ ఓపెన్ మైన్‌లోని కొంతభాగం శుక్రవారం ఉదయం కుప్పకూలినట్టు ధన్‌బాద్ ఎస్ఎస్‌పీ సంజీవ్ కుమార్ తెలిపారు. మృతుల సంఖ్యను నిర్ధారించాల్సి ఉందని, బీసీసీఎల్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ఈ బొగ్గు గని భోవ్రా ఏరియా కిందకు వస్తుందని, అక్కడ అక్రమ మైనింగ్ జరుగుతున్నట్టు కనిపిస్తోందని,ఘటనపై దర్యప్తు జరుపుతున్నామని, జోరాపోఖర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బినోద్ ఒరయాన్ తెలిపారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

అవన్నీ పుకార్లే.. : కాంగ్రెస్

న్యూఢిల్లీ : రాజస్థాన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు సచిన్ పైలట్ కొత్త పార్టీ ఏర్పాటు చేస్తారని వస్తున్న వార్తలన్నీ పుకార్లే అని పార్టీ ఖండించింది. ఇక్కడి ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ తాను ఎప్పటికప్పుడు సచిన్ పైలట్‌తో సంప్రదింపులు జరుపుతున్నానని, ఈ ఏడాది చివరిలో జరిగే రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐక్యంగా పోరాడుతుందని తెలిపారు. పైలట్ కొత్త పార్టీ గురించి ప్రశ్నించగా ' ఇవన్నీ పుకార్లు. నాకు తెలిసి రాజస్థాన్‌లో అలాంటివి లేవు' అని చెప్పారు. కాగా, తన తండ్రి రాజేష్ పైలెట్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 11న సచిన్ పైలట్ కొత్త పార్టీ ప్రకటన చేస్తారని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

'జల్ జీవన్' సక్రమ అమలుతో
4లక్షల మరణాలు నివారించవచ్చు

డబ్ల్యుహెచ్ఓ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : జల్ జీవన్ మిషన్ (జెఎంఎం)తో దేశవ్యాప్తంగా పైపుల ద్వారా తాగునీటిని ప్రజలకు అందించినట్లైతే భారత్‌లో దాదాపు 4లక్షల డయేరియా మరణాలను నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన అధ్యయనం పేర్కొంది. ప్రతి ఇంటికీ పైపుల ద్వారా మంచినీరును అందించాలనే లక్ష్యంతో 2019లో దాదాపు 3.6లక్షల కోట్ల రూపాయిల వ్యయ అంచనాలతో కేంద్రం జల్ జీవన్ మిషన్ (జెజెఎం) ప్రారంభించింది. పైగా ఇలా తాగునీటిని కుళాయి కనెక్షన్ల ద్వారా అందించడం వల్ల కోటీ 40లక్షల డిఎఎల్‌వై (డిజెబిలిటీ అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్స్)లను నివారించవచ్చుని, పదివేల కోట్ల డాలర్లకు పైగా మొత్తాన్ని ఆదా చేయవచ్చని, ప్రతి రోజూ మహిళలు నీటిని పట్టుకునేందుకు ఉపయోగించే సమయాన్ని 6.6కోట్ల గంటలను ఆదా చేయవచ్చని అధ్యయన వివరాలతో రూపొందించిన నివేదిక పేర్కొంది. డిఎఎల్‌వై అంటే పూర్తి స్థాయి ఆరోగ్యంతో కూడిన దాదాపు ఒక సంవత్సర కాలం నష్టానికి సమానం. ప్రజల్లో ఏదో ఒక వ్యాధి లేదా అనారోగ్య పరిస్థితి నెలకొన్న కేసులను లెక్కించడానికి, ముందస్తు మరణాల కారణంగా కోల్పోయిన జీవిత కాలాన్ని వైఎల్ఎల్ (ఇయర్స్ ఆఫ్ లైఫ్ లాస్ట్) గా, ఇయర్స్ లివ్డ్ విత్ ఎ డిజెబిలిటీ (వైఎల్‌డి)గా పేర్కొంటున్నారు. ప్రస్తుతం దేశంలో 12.3కోట్ల లేదా 62శాతం గ్రామీణ కుటుంబాలకు ఇళ్ళలో కుళాయి కనెక్షన్లు వున్నాయి. 2019లో ఈ పథకాన్ని ప్రారంభించిన సమయంలో ఈ సంఖ్య 3.2కోట్లుగా లేదా 16.6శాతంగా వుంది. 2024 నాటికి వందశాతం కుటుంబాలకు పైపుల ద్వారా తాగునీటిని అందించగలమని కేంద్రం చెబుతోంది. పూర్తి స్థాయిలో పనిచేసే కుళాయి కనెక్షన్ అంటే ఒక కుటుంబం ఏడాది పొడవునా రోజుకు సగటున 55లీటర్ల తాగు నీటిని పొందడంగా నిర్వచించింది. ప్రస్తుతమున్న స్థాయిలో పైపుల ద్వారా నీటిని అందించినట్లైతే నివారించగలిగే డయేరియా మరణాలను డబ్ల్యుహెచ్‌ఓ అధ్యయనం లెక్కించలేదని, అలాగే ప్రస్తుతం అందుబాటులో వున్న పైపుల ద్వారా తాగునీరు ఏ స్థాయిలో కలుషితమవుతోందో కూడా పరిగణనలోకి తీసుకోలేదని డబ్ల్యుహెచ్‌ఓకి చెందిన డాక్టర్, నివేదిక రూపకర్తల్లో ఒకరైనా రిక్ జాన్‌స్టన్ హిందూకు తెలిపారు. డబ్ల్యుహెచ్‌ఓ అధ్యయనమంటే ప్రస్తుతమున్న ధోరణులు ఇలాగే కొనసాగుతాయని భావించడం ద్వారా ఒక అంచనాకు లేదా నిర్ధారణకు రావడమేనని చెప్పారు. ఈ అంచనాలకు రావడానికి అవసరమైన డేటా కోసం నివేదిక రూపకర్తలు ఐక్యరాజ్య సమితి నుండి వచ్చిన జనాభా డేటాను, 2018 నాటి నేషనల్ శాంపిల్ సర్వేను, నీటి నాణ్యతపై జెజెఎం సేకరించిన డేటాను ఉపయోగించారు. ప్రస్తుతం ప్రతి రెండో ఇంటికి తాగునీటి కనెక్షన్ అందించబడింది. ఐదు రాష్ట్రాలు గుజరాత్, తెలంగాణా, గోవా, హర్యానా, పంజాబ్, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు అండమాన్ నికోబార్ దీవులు, డామన్ డయ్యూ, దాద్రా నాగర్ హవేలి, పుదుచ్చేరిల్లో వంద శాతమూ కనెక్షన్లు ఇచ్చారు. హిమాచల్ ప్రదేశ్‌లో 98.87శాతం, బీహార్‌లో 96.3శాతం కనెక్షన్లు వున్నాయని తాగునీరు, పారిశుధ్య విభాగ కార్యదర్శి విన్నీ మహజన్ తెలిపారు. డబ్ల్యుహెచ్‌ఓ అధ్యయన నివేదికను విడుదల చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తాగునీరు, పారిశుధ్య రంగాల్లో పెట్టే పెట్టుబడుల వల్ల అనేక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలతో పాటూ నాణ్యత గల జీవనం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. పారిశుధ్య రంగంలో ఖర్చుపెట్టే ప్రతి రూపాయికి ఆరోగ్య సంరక్షణ వ్యయం రూపంలో 4.3 రూపాయిలు తగ్గడం ద్వారా లాభం వుంటుందని ఆమె వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్‌కు సాయం అందిస్తాం : అమెరికా, బ్రిటన్

వాషింగ్టన్ : రష్యా చొరబాటుకు తిప్పి కొట్టేందుకు గాను ఉక్రెయిన్‌కు సాయం అందిస్తామని అమెరికా, బ్రిటన్‌లు ప్రకటించాయి. అట్లాంటిక్ డిక్లరేషన్ కింద ఇరు దేశాలు ఎదుర్కొంటున్న జాతీయ భద్రత, ఇతర ఆర్థిక భద్రతకు అవసరమైన కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని రక్షించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించనున్నట్లు ప్రకటించాయి. అమెరికా చేరుకున్న బ్రిటన్ అధ్యక్షుడు రిషి సునక్ గురువారం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో సమావేశమయ్యారు. ఇరువురు నేతలు వైట్ హౌస్‌లోని ఓవెల్ కార్యాలయంలో చర్చలు ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్, మినరల్స్‌కు సంబంధించి పరస్పర సహకారం అందించుకుంటామని ప్రకటించారు. డిక్లరేషన్‌లో భాగంగా ఇరువురు నేతలు యూరోపియన్ యూనియన్‌తో సహా కీలక చర్చలు జరిపారు. ఇవి ముడిసరుకుల దిగుమతులకు సంబంధించి జపాన్‌తో ఓ ఒప్పందం చేసుకున్నారు. ఉక్రెయిన్ సాయంపై కీలక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. రష్యాపై యుద్ధానికి ఉక్రెయిన్‌కి బ్రిటన్, అమెరికాలు సాయం అందిస్తున్నాయి. ఎఫ్ -16 యుద్ధ విమనాలు అందించడంతో పాటు పైలెట్లకు శిక్షణ ఇస్తామని గత నెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌కు ఆర్థిక సాయం అందిస్తామని బైడెన్ పునరుద్ఘాటించారు.

ఒమన్ జలసంధిలో భారత్, ఫ్రాన్స్, యుఎఇల విన్యాసాలు

న్యూఢిల్లీ : ఒమన్ జలసంధిలో ఈ నెల 7, 8 తేదీల్లో భారత్, ఫ్రాన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)దేశాల నావికా దళాలు త్రైపాక్షిక సముద్ర జలాల భాగస్వామ్య విన్యాసాలను నిర్వహించాయి. "ప్రధాన విన్యాసాల కార్యక్రమం సందర్భంగా సముద్రంలో విస్తృత స్థాయిలో విన్యాసాలు చోటు చేసుకున్నాయి. వ్యూహాత్మక ఫైరింగ్‌తో కూడిన ఉపరితల యుద్ధ కార్యకలాపాలు, క్షిపణులతో విన్యాసాలు, ఫ్రెంచి రాఫెల్, యుఎఇ డాష్-8 మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంపిఎ)లతో అత్యంత అధునాతనమైన వైమానిక రక్షణ విన్యాసాలు, హెలికాప్టర్ క్రాస్ ల్యాండింగ్ ఆపరేషన్లు, సముద్ర జలాల్లో స్టాక్‌ను నింపుకునే డ్రిల్స్ వంటి చర్యలను మూడుదేశాల నావికాదళాలు నిర్వహించాయని భారత నేవీ పేర్కొంది. ఈ విన్యాసాల కోసం భారత నావికాదళం స్టెల్త్ యుద్ధ నౌక ఐఎన్ఎస్ తర్కష్‌ను మొహరించింది. అత్యుత్తమ పద్ధతులు గురించి పరస్పరం తెలుసుకోవడానికి ఈ శిక్షణా విన్యాసాలు ఉపకరించాయి. ఈ మూడు దేశాల నావికాదళాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ విన్యాసాలు దోహదపడ్డాయని, సముద్రజలాల్లో ఎదురయ్యే సాంప్రదాయ, సాంప్రదాయేతర ముప్పులను ఎదుర్కొనడానికి కూడా ఉపయోగపడ్డాయని భారత నేవీ పేర్కొంది. ఈ ప్రాంతంలో సముద్ర జలాల్లో నౌకల స్వేచ్ఛా రాకపోకలకు, వాణిజ్యానికి, భద్రతకు కూడా హామీ కల్పించబడిందని పేర్కొంది.

ఇమ్రాన్ ఖాన్ పార్టీలో చీలిక : కొత్త పార్టీ ఏర్పాటు

లాహోర్ : పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పిటిఐ)లో చీలిక ఏర్పడింది. పిటిఐ నుంచి వైదొలగిన దాదాపు 100 మంది నాయకులు 'ఇస్తేఖామ్ ఏ పాకిస్థాన్ పార్టీ' (ఐపిపి)ని ప్రారంభించారు. మే 9వ తేదీన ఇమ్రాన్ ఖాన్ అరెస్టుకు నిరసనగా ఆయన అనుచరులు దేశమంతటా ఆందోళనకు దిగారు. ఈ అల్లర్లు జరిగినప్పటి నుంచి పీటీఐ నుంచి పలువురు నాయకులు నిష్క్రమించసాగారు. వీరంతా కొత్త పార్టీ ఐపీపీని ప్రారంభించారు. అక్టోబరులో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఐపీపీ పాక్ సైన్యం అండతో పోటీ చేస్తుందని అంచనా. పాక్ సైన్యం ఒత్తిడితోనే దాదాపు 130 మంది నాయకులు పార్టీ నుంచి వైదొలిగారని ఇమ్రాన్ ఖాన్ ఆరోపిస్తున్నారు.

0.3 శాతంగా పాకిస్తాన్ జిడిపి

ఇస్లామాబాద్ : 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)ని ఐదు శాతంగా అంచనా వేసినప్పటికీ... 0.3 శాతంగా ఉన్నట్లు పాకిస్తాన్ ఆర్థిక మంత్రి ఇషాక్ దార్ వెల్లడించారు. 2022-23 నాటి దేశ ఆర్థికసర్వేను గురువారం ఆయన విడుదల చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఈ సమావేశంలో ప్రణాళిక మంత్రి అహ్సన్ ఇక్బాల్, ఆర్థిక మరియు రెవెన్యూ సహాయ మంత్రి ఐషా గౌస్ పాషా కూడా పాల్గొన్నారు. వృద్ధి, వ్యవసాయం, సేవలు 1.5 శాతం ఉండగా, వృద్ధి రేటు 0.86 శాతంగా ఉన్నట్లు తెలిపారు.

బట్టబయిలైన బిజెపి బూటకాల ఫ్యాక్టరీ!

- రాజదండంపై కల్పిత కథను అల్లారంటూ కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ : బ్రిటీష్ వారి నుండి భారత దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు అధికారాన్ని బదిలీచేయడానికి గుర్తుగా ఆనాడు రాజదండాన్ని అందచేశారంటూ బిజెపి చెప్పిన కట్టుకథ లోని డొల్లతనం బయటపడిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విమర్శించారు. శుక్రవారం నాడు ఆయన ఇక్కడ మాట్లాడుతూ, బిజెపిని బూటకాల ఫ్యాక్టరీగా అభివర్ణించారు. హిందూ దినపత్రికలో ప్రచురితమైన తిరువవదూత్తురై అదీనామ్ ప్రధాన పూజారి ఇచ్చిన ఇంటర్వ్యూను రమేష్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాజదండాన్ని భారత్ చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్‌కు ఇచ్చినట్లు ఆయన నెహ్రూకు అందచేసినట్లు ఎక్కడా స్పష్టమైన సాక్ష్యాధారాలు లేవని తెలిపారు. ప్రధాన పూజారి స్వామింగళ్ స్వయంగా హిందూకు ఈ విషయం చెప్పారని దీంతో బిజెపి అల్లిన కట్టుకథ బహిర్గతమైందని జైరాం రమేష్ విమర్శించారు. 1947 ఆగస్టు 14వ తేదీ రాత్రి అధికార బదిలీ సమయంలో మౌంట్‌బాటన్ లేరు, రాజాజీ లేరు, అయితే ఈ రాజదండాన్ని నెహ్రూకు ఆయన నివాసంలో 14వ తేది రాత్రి రాత్రి 10గంటల సమయంలో బహుమతిగా ఇచ్చిన విషయం మాత్రం వాస్తవమేనని ఆయన ట్విట్టర్‌లో తెలిపారు. ఈ మేరకు 1947 ఆగస్టు 19నాటి హిందూ ఎడిషన్ 10వ పేజిని ఆయన ప్రస్తావించారు.

కమిటీ నుంచి మమ్మల్ని తొలగించండి

- పాఠ్యపుస్తకాల్లో కోతలు, తొలగింపులపై ఆక్షేపణ
- ఎన్‌సీఈఆర్‌టీకి పొలిటికల్ సైన్స్ పుస్తకాల కమిటీ సలహాదారుల లేఖ

న్యూఢిల్లీ : పాఠ్యపుస్తకాల కమిటీలో ఉండటం ఇబ్బందిగా ఉందనీ, పొలిటికల్ సైన్స్ పుస్తకాల కమిటీ నుంచి తమను తొలగించాలని ఎన్‌సీఈఆర్‌టీకి సలహాదారులు లేఖ రాశారు. 2006-07 నుంచి ప్రచురించబడిన 9 నుంచి 12 తరగతుల పొలిటికల్ సైన్స్ పుస్తకాలకు ముఖ్య సలహాదారులుగా ఉన్న సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్‌లు ఎన్‌సీఈఆర్‌టీకి రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ పాఠశాల పాఠ్యపుస్తకాలను ఛిద్రం చేసిందనీ, వాటిని విద్యాపరంగా పనిచేయనిదిగా మార్చిందని పేర్కొన్నారు.

పాఠశాల పాఠ్యపుస్తకాల్లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ఇటీవల చేసిన 'అసంఖ్యాకమైన తొలగింపులు అహేతుకమైనవి' అని ఆక్షేపించారు. అందువల్ల ప్రస్తుత రూపంలో ఉన్న పాఠ్యపుస్తకాల కమిటీలో తమ పేర్లను తొలగించాలని అభ్యర్థించారు.

కోవిడ్-19 వల్ల ఏర్పడిన నేర్చుకునే అంతరాయాల నుంచి విద్యార్థులు కోలుకోవడానికి పాఠ్యాంశాలను తగ్గించే సాకుతో గతేడాది (ఈ సంవత్సరం అమలులో) చేసిన భారీ మార్పులు, తొలగింపులు చాలాకాలంగా విమర్శలకు, వివాదాలకు కేంద్రంగా ఉన్నాయి. ఈ మార్పులలో 2002 గుజరాత్ అల్లర్లకు సంబంధించిన అన్ని సూచనలను తొలగించడం, మొఘల్ శకం, కుల వ్యవస్థకు సంబంధించిన కంటెంట్‌ను తగ్గించడం, నిరసనలు, సామాజిక ఉద్యమాలపై అధ్యాయాలను తొలగించడం వంటివి ఉన్నాయి.

'ఏదైనా పాఠ్యాంశాల్లో అంతర్గత తర్కం ఉంటుంది. ఇలాంటి ఏకపక్ష కోతలు, తొలగింపులు పుస్తకాల స్ఫూర్తిని ఉల్లంఘిస్తాయని మేం నమ్ముతున్నాం. తరచుగా, వరుస తొలగింపులు అధికారాలను సంతోషపెట్టడానికి తప్ప ఎటువంటి లాజిక్‌ను కలిగి ఉన్నట్టు కనిపించడం లేదు' అని యాదవ్, పల్షికర్ ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ డిఎస్ సక్లానీకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

ప్రస్తుత ఆకృతిలో ఉన్న పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పొలిటికల్ సైన్స్‌లో శిక్షణ ఇవ్వడానికి పనికిరావని అన్నారు. 'ఈ మార్పులు విద్యాపరంగా పనికిరావు. పుస్తకాల్లో మా పేర్లను ఉంచటం మాకు ఇబ్బందిగా ఉంది. మా పేర్లను తొలగించాలి' అంటూ సక్లానీని యాదవ్, పల్షికర్ అభ్యర్థించారు.

మాగుంట రాఘవ్ బెయిల్ కుదింపు

- 12న సరెండర్ అవ్వాలని సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి తనయుడు మాగుంట రాఘవ్ మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు కుదించింది. జూన్ 12న సరెండర్ కావాలని రాఘవను సుప్రీం ఆదేశించింది. మాగుంట రాఘవ్ కు ఢిల్లీ హైకోర్టు 15 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సుప్రీంలో సవాలు చేసింది. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ రాజేష్ బిందాల్ తో కూడిన సుప్రీం ధర్మాసనం మాగుంట రాఘవ్ బెయిల్‌ను 15 రోజుల నుంచి ఐదు రోజులకు కుదించింది. ఈనెల 12న స్థానిక కోర్టులో హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఫిబ్రవరి 10న రాఘవను ఈడి అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

వ్యవసాయ కార్మికుల పట్ల నిర్లక్ష్యం

- దేశవ్యాప్త ఆందోళనకు సంఘాలు పిలుపు
- కేంద్ర మంత్రులకు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గ్యారెంటీ పనిదినాలు ఏటా 200కు పెంచాలని, కనీస వేతనం రోజుకు రూ.600గా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) సహా ఐదు వ్యవసాయ కార్మిక సంఘాలు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కు వినతిపత్రం సమర్పించాయి. ఒరిస్సా రైలు విపత్తు నేపథ్యంలో, కోవిడ్ -19 మహమ్మారి సమయంలో రద్దు చేయబడిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, మరిన్ని జనరల్ బోగీలను అనుమతించాలని డిమాండ్ చేస్తూ సంస్థలు రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పించాయి. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి.శివదాసన్ మాట్లాడుతూ వినతిపత్రంలోని డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. "ఉపాధి హామీ పథకం కేటాయింపుల్లో కోత విధిస్తూ కేంద్రం పూర్తిగా విస్మరిస్తోంది. పథకం అమలు చేసి కులాల వారీగా నిధులు కేటాయించాలనే ఎత్తుగడను ఉపసంహరించుకోవాలి. కార్మికులకు పెన్షన్ భరోసా, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడం వంటి వాటిని త్వరగా అమలు చేయాలి. ఉపాధి హామీ పథకానికి రూ.2.56 లక్షల కోట్లు కేటాయించాలి" అని డిమాండ్ చేశారు. ఒరిస్సా రైలు ప్రమాదంలో మరణించిన జనరల్ బోగీలలో వ్యవసాయ కూలీలు ఎక్కువ మంది ఉన్నారన్నారు. ధనికుల విలాసవంతమైన ప్రయాణానికి వందేభారత్ మొదలైన వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా కార్మికులు, ఇతరులపై ఎక్కువగా ఆధారపడే జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని అన్నారు.

ఆన్‌లైన్ ఇ-ఆక్షన్ సేల్ ఆఫ్ అస్సెట్

kotak
Kotak Mahindra Bank
కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్
రిజిష్టర్డు ఆఫీసు: 27బికెసి, సి-27, జి-బ్లాక్ బంద్ర కుర్ల కాంప్లెక్స్ బంద్ర (ఈస్ట్) ముంబయి-400051బ్రాంచి ఆఫీసు: 185, 2వ అంతస్తు, మౌంట్ రోడ్డు, అన్నా సలై, చెన్నై-600 006

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 8(6) తో చదువుతూ రూల్ 8(5) క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 కింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం కం విక్రయ నోటీసు.
రుణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కి తనఖా పెట్టబడిన ఆస్తి/ఛార్జ్‌చేయబడిన స్థిరాస్తిని కోటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. స్మాల్ బిజినెస్ ఫిన్‌క్రెడిట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌బిఎఫ్‌సి) ద్వారా దాని అనుకూలంగా రుణ కేటాయింపు ప్రకారం 10.11.2023న "ఎక్కడ ఉంది", "ఏది ఉంది" మరియు "అక్కడ ఏమైన" ప్రాతిపదికన 20.07.2023, మ.12.00గం. నుండి 01.00గం. మధ్య 5 ని॥ల అపరిమితమైన పరిమితులతో విక్రయించబడుతుంది. లోన్ ఎకౌంట్ నం.:PR00422384, ఎమ్. గురుమూర్తి, ఎమ్.సాయి కళ్యాణి మరియు ఎమ్.గురు శేఖర్‌సాయి, నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ కెఎమ్‌బిఎల్ కి ఉన్న బకాయి రికవరీ కొరకు ఉన్న మొత్తం రూ.24,20,616.27/- (ఇరవై నాలుగు లక్షల ఇరవై వేల ఆరు వందల పదహారు రూపాయల ఇరవై ఏడు పైసలు మాత్రమే) 5.6.203 నాటికి తదుపరి వడ్డీతో పాటు 6.6.2023న నుండి చెల్లించే వరకు మొత్తం ఖర్చులతో పాటు ఛార్జీలు మరియు వర్తించే వడ్డీ, రిజర్వు ధర రూ.11,00,000/- (పదకొండు లక్షల రూపాయలు మాత్రమే) కెవైసితో ఇఎమ్‌డి సమర్పణకు చివరి తేది: 19.07.2023, సా.6.00గం. (ఐఎస్‌టి)
ఆస్తి వివరణ: పోస్టల్ చిరునామా: డో.నం.80, ఇఎస్‌ఆర్ కాపు వీధి, తూర్పు గూడూరు, ఆంధ్రప్రదేశ్-524101 మరింత వివరంగా వివరించబడినది: ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, గూడూరు ఆర్.ఓ. గూడూరు మండలం, గూడూరు మున్సిపల్ ఏరియా, తూర్పు గూడూరు గ్రామం ఎస్.నం.577/4, వార్డు నం.6 తూర్పు కాపు వీధి (ఇంటీరియర్) తూర్పు డో.నం.80, మూల్యాంకనం నం. 1029007897, ఖాళీ స్థలం యొక్క విస్తీర్ణం 9 అంకనామాలు లేదా 72 చ.గ.లు.లేదా 60.21 చ.మీ.లు. హద్దులు: ఆస్తి యొక్క హద్దులు (డాక్యుమెంట్ నం.1201/1995) తూర్పు: ఈ ఖాళీ సైట్ యొక్క ఉమ్మడి లేన్ మరియు బి.జయరామ్ సింగ్ 3 అ.లు వెడల్పు, పూజారి నారాయణ, సురేంద్ర యొక్క ప్రక్కనే కాంపౌండ్ ఇంటి గోడ, దక్షిణం: బొంది జయరాం సింగ్ యొక్క ఇంటి గోడ, పడమర: జయరామయ్య యొక్క ఖాళీ సైట్, ఉత్తరం: ఎమ్. కోటేశ్వరరావు యొక్క ఇంటి ప్రక్కనే. ఆర్.జయరామయ్య యొక్క ఇగ్రెస్ మరియు ఇగ్రెస్ 4 అ.లు. వెడల్పు.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.
రుణగ్రహీతలు మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజలు వేలంలో ఉంటే దయచేసి గమనించవలసింది ఏమనగా ఒక వేళ వేలం వేస్తే ఇక్కడ ఉన్న షెడ్యూల్ చేయబడినది ఏ కారణంతోనైనా విఫలమైతే, అప్పుడు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క విచక్షణతో, సెక్యూర్డ్ ఇంట్రస్ట్‌ని అమలు చేయండం ద్వారా సెక్యూర్డ్ క్రెడిటార్ వివరణలో ప్రైవేట్ ఒప్పంద విక్రయం. విక్రయంలో ఉన్న ఆస్తులకు సంబంధించిన ఏదైనా స్పష్టత/అవసరం ఉన్నట్లయితే బిడ్డర్ సంప్రదించాల్సిన వారు : శ్రీ. విశాల్ ఆదిశేషన్ (+91 9941016600), శ్రీ శ్యామ్ నంబూరి (+91 9677288418) శ్రీ. గుర్పాల్ సింగ్ (+91 8976898212) మరియు శ్రీ. రాజేంద్రర్ దహియ (+91 8448264515) అమ్మకం యొక్క వివరణాత్మకమైన షరతులు మరియు నియమముల కొరకు లింక్ **HTTPS://WWW.KOTAK.COM/EN/BANK-AUCTIONS.HTM** ని దయచేసి చూడండి. కోటక్ మహీంద్రా బ్యాంక్ వెబ్‌సైట్ అనగా.. **WWW.KOTAK.COM** మరియు/లేదా **HTTPS://BANKEAUCTIONS.COM**

ప్రదేశం : గూడూరు
తేది: 10.06.2023
ఆధీకృత అధికారి
కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్